రేపటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్..'

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తీసుకెళ్తాం..

విజయనగరం పూల్‌బాగ్: ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి.. వారి అభిప్రాయాలను తెలుసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఇంకేమైనా సమస్యలున్నాయా... లేవా అని కూడా తెలుసుకుంటామన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 14 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ తరఫున నియమితులైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు భాగస్వామ్యం అవుతారని తెలిపారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా ప్రజలకు వివరిస్తామన్నారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, ఇతర కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాల కోసం కొంత మొత్తాన్ని వెచ్చిస్తుందని చెప్పారు. అందులోభాగంగానే నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే తెలుగుదేశం పార్టీ నాయకులు.. రాష్ట్రం దివాలా తీస్తోందని వారి అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారాలు చేస్తూ, ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని, లంచగొండితనాన్ని అదుపు చేశామని, మౌలిక సదుపాయాలు కల్పించామని.. అందుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని చెప్పారు.


మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

చంద్రబాబుకు పొత్తుల తాపత్రయం..

ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెప్పారని కోలగట్ల అన్నారు. ఇప్పుడు ఒంటరిగా ఎన్నికలకు వెళ్లలేక పొత్తుల కోసం తాపత్రయపడుతున్నారని ఆరోపించారు. ఎంతమంది కలిసినా జగన్ మోహన్‌రెడ్డిని ఓడించలేరని స్పష్టం చేశారు.

'దండి మార్చ్' విగ్రహావిష్కరణ నేడు

నగర సుందరీకరణలో భాగంగా విజయనగరంలోని ఐస్ ఫ్యాక్టరీ కూడలి వద్ద ఉప్పు సత్యాగ్రహం సందర్భాన్ని గుర్తు చేస్తూ.. ఏర్పాటుచేసిన దండి మార్చ్ విగ్రహాలను గురువారం ఆవిష్కరించనున్నట్లు కోలగట్ల తెలిపారు. ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదగా జరగనున్న ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనందంగా ఉంది..


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దర్బార్ నిర్వాహకులు ఖలీల్‌బాబు, తదితరులు

విజయనగరం టౌన్: పవిత్ర రంజాన్ మాసంలో తమవంతు బాధ్యతగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు అందించడం ఆనందంగా ఉందని హజరత్ ఖాదర్ ఔలియా దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డాక్టర్ ఎం.డి. ఖలీల్‌బాబు అన్నారు. సూఫీ సద్గురు అతావుల్లా షరీఫ్ బాబా ఖాన్ కా తేరవీ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ దర్బార్‌లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటూ పరిసర ప్రాంత ప్రజలకు ఖాదర్‌బాబా అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఇఫ్తార్ అందిస్తుండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు, బాబా సేవకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి వితరణ


రూ. లక్ష విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిళ్లా విజయకుమార్

విజయనగరం: దాసన్నపేట రింగ్‌రోడ్‌లో గల కాళికామాత ఆలయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిళ్లా విజయ్‌కుమార్ లక్ష రూపాయలు బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు విజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో వెంకట లీలాప్రసాద్, సాధునపల్లి వెంకట్ రావు, ప్రభాస్ శ్రీను, పంతులు శ్రీను, లక్ష్మణరావు, ఆలయ పూజారి ఆదిత్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు

విజయనగరం టౌన్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి స్వామివారికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అష్టకలశ స్నపనం, అభిషేకాలు.. 10 గంటలకు సామూహిక విష్ణు, లలితా సహస్ర నామ పారాయణం .. సాయంత్రం స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.

అవయవదానానికి అంగీకారం


హామీపత్రాలను గోవిందరాజులకు అందజేస్తున్న బాడాం గ్రామస్తులు

మెరకముడిదాం: మండలంలోని బాడాం గ్రామస్తులు, యువత అవయవదానానికి ముందుకు వచ్చారు. చీపురుపల్లి మానవీయత స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు అవయవదానంపై బుధవారం అవగాహన కల్పించారు. తాము మరణించిన తర్వాత తమ శరీరం మట్టిలో కలిసిపోయేకంటే అవయవ దానంచేస్తే మరికొంతమందికి ప్రాణ దానం చేసిన వాళ్లమవుతామని భావించి 60 మంది అవయవదానానికి అంగీకారం తెలిపారు. హామీ పత్రాలపై సంతకాలు చేసి గోవిందరాజులుకు అందజేశారు.

వాన నీటిని ఒడిసి పడదాం


సోక్‌ఫిట్‌లపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సంతోష్‌కుమార్

బొండపల్లి: వాన నీటిని ఒడిసి పట్టేందుకు మండలంలోని ప్రతి జగనన్న లేఅవుట్‌లో మ్యాజిక్ సోక్ ఫిట్‌లు(ఇంకుడు గుంతలు) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ ఎస్.సంతోష్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు సోక్ ఫిట్‌లపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 36 జగనన్న లేఅవుట్లు ఉన్నాయని, ఆయా లే అవుట్లలో వర్షం నీరు నేరుగా భూమిలోకి ఇంకే విధంగా సోక్ ఫిట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆర్థిక సహాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన గుమ్మడి నాయుడు కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈయన వైద్య ఖర్చుల నిమిత్తం వేపాడకు చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్టు సభ్యులు బుధవారం ఆస్పత్రికి వెళ్లి రూ.16,500 ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్టు సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జన్మదినం


డెంకాడ: ఆకట్టుకున్న మహిళల కోలాటం


పూసపాటిరేగ: కోనాడలో అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


డెంకాడ: పల్లకిలో అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు


డెంకాడ: కళశాలతో మహిళలు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వేద పండితుడు వాడ్రేవు నాగరాజశర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా..

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో అయ్యప్పస్వామి జన్మదినం వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి నూతన విగ్రహానికి గురుస్వాములు శ్రీను పంతులు, వర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు ఘనంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి మందిరం నుంచి మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు చేపట్టారు. మహిళలు కళశాలలతో ఊరేగింపుగా వచ్చారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది.

మహిళల ఆర్థిక స్వావలంబనే ఆసరా ధ్యేయం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: అక్కా, చెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనే వైఎస్సార్ ఆసరా ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 1,055 స్వయం సంఘాల్లోని 11,521 మంది మహిళలకు రూ.7.17 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడపడుచుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం పసుపు – కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. కాని ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను అమలు చేస్తూ నేరుగా అక్కా చెల్లెమ్మల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నారన్నారు. మహిళల మోములో ఆనందం ఎల్లప్పుడూ వెల్లివిరియాలంటే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే విశాఖను రాజధానిగా చేస్తున్నారని చెప్పారు. అనంతరం వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. అలాగే నాయకులతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అంతకుముందు బాబా జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పడాల సత్యవతి, దంతులూరి సూర్యనారాయణరాజు, పడాల భానుప్రకాష్, మత్స్యశాఖ డైరెక్టర్ ఎం.నరసింహులు, పడాల శ్రీనివాసరావు, రమేష్‌రాజు, సుందర హరీష్, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, డీఆర్‌డీఏ ఎ.కల్యాణ చక్రవర్తి, ఏరియా కోఆర్డినేటర్ ఎస్.రాజ్‌కుమార్, డీటీ శ్రీనివాస్, ఏపీఎం రమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఎంపీపీ అనూషారెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు


కార్యక్రమానికి హాజరైన మహిళలు

జగనన్నకు రుణపడి ఉంటాం..



మహిళలకు రుణవిముక్తి కల్పించేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలుచేయడం సంతోషకరం. ఇచ్చిన మాట ప్రకారం ఏటా ఆసరా సాయం అందిస్తూ నాలాంటి పేదవారి బతుకుల్లో జగనన్న వెలుగులు నింపారు. ఇప్పటివరకు రూ.3 లక్షల అప్పు తీరింది. అందులో నా వాటాగా రూ.30 వేలు వచ్చింది. మొదటి విడతలో కుట్టుమిషన్ కొనుక్కున్నాను.. రెండో విడతలో ఇంటికి కరెంట్ మీటర్ వేయించుకున్నాను. మూడవ విడత సాయం కూడా అందింది. సీఎం జగనన్నకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

–మాధవి, శ్రీవిఘ్నేశ్వర స్వయం శక్తి సంఘం సభ్యురాలు, గుడివాడ

నిబంధనలు తప్పనిసరి


జాతీయ రహదారిపై స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిందేనని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు స్పష్టం చేశారు. చెల్లూరు జాతీయ రహదారి వద్ద ఆరు స్టాపర్లను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకోకుండా స్టాపర్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రహదారి భద్రతలో భాగంగా వాహనాల వేగం నియంత్రించి ప్రమాదాలు జరగకుండా స్టాపర్లు ఉపయోగపడతాయన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిందు సేద్యంతో బహుళ ప్రయోజనాలు

జామి: బిందుసేద్యం (డ్రిప్ ఇరిగేషన్)తో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. అలమండ గ్రామంలో రైతు జానకి రామరాజు పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడు తూ ప్రభుత్వం సన్న,చిన్నకారు రైతులకు 90శాతం రాయితీపై, 5 ఎకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్టు చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి ఆదాతో పాటు, పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. నేరుగా డ్రిప్ ద్వారానే ఎరువులు పంటకు అందించవచ్చని, ఈ విధానంతో రైతులకు సమయం ఆదా అవుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.


డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ

10వ తేదిలోగా ఈకేవైసీ చేయించుకోండి

బొండపల్లి: పీఎం కిసాన్ యోజన పథకానికి సంబంధించి, రబీ ఈ –క్రాప్‌కు సంబంధించి రైతులు అంతా తప్పనిసరిగా ఈనెల 10వతేదిలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదిస్తే, అక్కడి సిబ్బంది ఈకేవైసీ చేస్తారని పేర్కొన్నారు.

పేదవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్..

విజయనగరం పూల్‌బాగ్: పేదవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు అన్నారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయం ఆవరణలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, జె. చిన్నారావు, జి. రవి, ఎం. సూర్యచంద్ర, బి. విజయబాబు, కె. వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనంపై ఎనలేని పోరు..

విజయనగరం ఫోర్ట్: బాబూ జగ్జీవన్‌రామ్ అంటరానితనంపై ఎనలేని పోరాటం చేశారని ఎంఈఎఫ్ (మాదిగ ఉద్యోగుల పోరాట సమితి) జిల్లా అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగ్జీవన్‌రామ్ కేంద్ర మంత్రిగా కార్మిక, నీటిపారుదల, రక్షణ శాఖల్లో తనదైన ముద్ర వేశారని తెలిపారు. దళిత సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి. భానుమూర్తి, ఎంఈఎఫ్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ అరసాడ రవికుమార్, నిర్మలమూర్తి, భోగి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం టౌన్: బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్య కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి, తదితరులు


విజయనగరం పూల్‌బాగ్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న యూనియన్ నాయకులు


విజయనగరం ఫోర్ట్: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇజ్రాయిల్

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి..

విజయనగరం టౌన్: దేశానికి ఎనలేని సేవలందించిన బాబూ జగ్జీవన్‌రామ్ వంటి మహనీయులను నేటితరం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి అన్నారు. భారతదేశ ఉప ప్రధానిగా, రక్షణశాఖ , వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతిని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామ శ్మశానానికి రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు బుధవారం భూమిపూజ చేశారు. గ్రామం నుంచి గెడ్డ పక్కగా శ్మశానానికి రోడ్డు ఫార్మేషన్‌కు మండల పరిషత్ నిధులు రూ.50వేలు మంజూరు చేశామని చెప్పారు. వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ, పంచాయతీరాజ్ జోనల్ కన్వీనర్ ఎం.సత్యనారాయణ, సర్పంచ్ గలారి బంగారయ్య, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, గ్రామపెద్దలు అవగడ్డ వెంకటరావు, చల్లా జగన్, శిరికి అప్పలసత్యనారాయణ, కన్నబాబు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

రాజాం సిటీ: మండల పరిధిలోని అంతకాపల్లి పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాస కల్యాణంతో పాటు గరుడ సేవ కార్యక్రమాలు బుధవారం చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మొదటిసారిగా బ్రహ్మోత్సవాలు జరగడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాట నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వెంకటయ్య, సూపరింటెండెంట్ వెంకటరమణ, చంద్రమౌళీశ్వరశర్మ, శేషుబాబు, గ్రంధి భాస్కరరావు, ఆర్.అన్నంనాయుడు, గ్రంధి రవికుమార్ పాల్గొన్నారు.